వలంటీర్లు లేకుండానే పింఛన్లు

- ఎన్నికల ముందు వలంటీర్లకు రూ.10 వేల వేతనం ఇస్తామని హామీ
- నేడు వలంటీర్లను పక్కనపెట్టి వైనం
- సచివాలయ ఉద్యోగులతో పంపిణీ
- ఏప్రిల్ నుంచి పెంచిన పింఛన్లు ఇస్తామన్న కూటమి ప్రభుత్వం
- నియోజకవర్గంలో 34,902 మంది పింఛన్ లబ్ధిదారులు

సామాజిక పింఛన్ల పంపిణీలో కీలకమైన వలంటీర్లను కూటమి ప్రభుత్వం ఆ విధుల నుంచి తప్పించింది. సచివాలయ ఉద్యోగుల ద్వారానే ఈ నెల పింఛన్ల పంపిణీ చేయాలని ఆదేశించడంతో వారి వద్ద సెల్‌ఫోన్, బయోమెట్రిక్ పరికరాలను స్వాధీనం చేసుకున్నారు. దీంతో వలంటీర్ల వ్యవస్థపై నీలినీడలు కమ్ముకుంటున్నాయి. వలంటీర్ల జీతం పెంచడం దేవుడెరుగు అసలు వ్యవస్థను కొనసాగిస్తారో లేదోనన్న చర్చ సాగుతోంది.

ఆలూరు రూరల్: గత ఐదేళ్లుగా ఒకటో తేదీ రాగానే తెల్లవారుజాము నుంచి పింఛన్ల పంపిణీ జరిగేది. సచివాలయ వలంటీర్లు ప్రతి ఇంటికీ వచ్చి తలుపు తట్టిమరీ పింఛన్లు ఇచ్చి వెళ్లేవారు. ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైనప్పటి నుంచి పింఛన్ల పంపిణీ గాడి తప్పింది. వలంటీర్లను పింఛన్ల పంపిణీ చేయకుండా అడ్డుకోవడంతో అవ్వాతాతలు ఇబ్బంది పడ్డారు. అసలు పింఛను ఇస్తారో లేదో అని ఆందోళన చెందారు. కొందరు వృద్ధులు ఎండల్లో బ్యాంకుల చుట్టూ తిరగలేక ఒత్తిడికి గురయ్యారు. ఏప్రిల్ నెలలో సచివాలయాల వద్ద పింఛన్లు పంపిణీ చేయగా మే, జూన్ నెలల్లో బ్యాంకుల్లో జమ చేయడంతో వృద్ధులు, వికలాంగులు, ఒంటరి మహిళలు అనేక ఇబ్బందులు పడ్డారు.

ఎన్నికల ముందు హామీ

తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే వలంటీర్ల ద్వారానే పింఛన్లు అందజేస్తామని కూటమి నాయకులు హామీ ఇచ్చారు. వలంటీర్లను ఎవరినీ తొలగించమని, వారిని కొనసాగిస్తామని, గౌరవ వేతనం రూ.10 వేలు ఇస్తామని చెప్పారు. తీరా ఇప్పుడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత వలంటీర్లను పక్కన పెట్టేశారు.



వృద్ధురాలికి పింఛన్ అందిస్తున్న వలంటీర్ (ఫైల్)

ఎదురుచూపుల్లో వలంటీర్లు

2019 ఆగస్టు 15వ తేదీ అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి గ్రామ సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి 50 ఇళ్లకు ఒక వలంటీర్, ప్రతి 2 వేల ఇళ్లకు ఒక సచివాలయాన్ని ఏర్పాటు చేశారు. ఆలూరు నియోజకవర్గంలో 98 సచివాలయాలు ఉన్నాయి. మొత్తం 1,249 మంది వలంటీర్లు ప్రజలకు సేవలు అందించేవారు. ఇటీవల ఎన్నికల సమయంలో వివిధ కారణాలతో కొంత మంది వలంటీర్లు రాజీనామా చేశారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు నోటిఫికేషన్ విడుదలైనప్పటి నుంచి వారు విధులకు దూరంగా ఉంటున్నారు. జూన్ 4న కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. అప్పటి నుంచి వారు దూరంగా ఉంటున్నారు. ఇప్పటికే ప్రభుత్వం ఇచ్చిన మొబైల్ ఫోన్లు, బయోమెట్రిక్ పరికరాలు, సిమ్ కార్డులు ఎంపీడీఓ కార్యాలయంలో అప్పగించారు. ఈ నెల పింఛన్ల పంపిణీకి కూడా వారిని దూరంగా పెడుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంతో వలంటీర్ల వ్యవస్థను కొనసాగిస్తారో లేదో అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. వలంటీర్ల వ్యవస్థను రూపుమాపేందుకే కీలకమైన పింఛన్ల పంపిణీకి వారిని దూరంగా పెట్టినట్లు ప్రచారం జరుగుతోంది.

పెంచిన పింఛన్లతో కలిపి పంపిణీ

నియోజకవర్గంలో 34,902 మంది పింఛన్ లబ్ధిదారులు ఉన్నారు. వీరికి ఇప్పటి వరకు ప్రతి నెలా రూ. 3వేలు పింఛన్ ఇచ్చేవారు. టీడీపీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రూ.3 వేల నుంచి రూ.4 వేలకు పెంచుతున్నట్లు ప్రకటించింది. దీంతో పాటు ఏప్రిల్ నుంచి జూన్ వరకు నెలకు రూ. 1000 చొప్పున బకాయిలు ఇస్తామని చెప్పింది. అంటే ఒక్కో లబ్ధిదారుకు ఈనెల రూ.7 వేల చొప్పున పింఛన్ అందించాల్సి ఉంది. 11 కేటగిరి వారికి పెంచిన బకాయిలు ఏప్రిల్ నుంచి చెల్లించనున్నారు.

పింఛన్ల పంపిణీ ఇలా..

గ్రామ సచివాలయ ఉద్యోగుల ద్వారా పింఛన్ల పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఆలూరు నియోజకవర్గంలోని 98 గ్రామ సచివాలయాల్లో ప్రతి సచివాలయంలో 11 మంది విధులు నిర్వహిస్తున్నారు. ఒక్కో సచివాలయంలో పనిచేసే ఉద్యోగికి కనిష్ఠంగా 50 నుంచి గరిష్ఠంగా 100 లోపు ఉన్న పింఛన్ల లబ్ధిదారులకు మ్యాపింగ్ చేశారు. ఇందులో భాగంగానే ఇప్పటికే ఆయా మండలాల పరిధిలోని ఎంపీడీఓలు పింఛన్ల పంపిణీపై సూచనలు ఇచ్చారు.

చినుకు పడితే చిత్తడే



కైరుప్పల బీసీ కాలనీలో రోడ్డుపై నిలిచిన మురుగు

ఆస్పరి: మండలంలోని కైరుప్పల గ్రామం ఎస్సీ, బీసీ కాలనీ రోడ్లు చినుకు పడితే చిత్తడిగా మారుతున్నాయి. నడవడానికి కూడా వీలు లేకుండా బురదతో నిండిపోన్నాయి. వర్షం వస్తే గుంతల్లో నీరు చేరి మురుగమయంగా మారుతోందని స్థానికులు వాపోతున్నారు. దోమలు వృద్ధి చెంది రోగాల బారిన పడుతున్నామని చెబుతున్నారు. అధికారులు స్పందించి సిమెంట్ రోడ్లు, డ్రైనేజీ కాలువలు నిర్మించాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

బాలికల హాస్టల్‌కు నీటి సౌకర్యం

వెల్దుర్తి(కృష్ణగిరి): పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంకుమార్ బాబు చొరవతో వెల్దుర్తి బీసీ బాలికల హాస్టల్‌కు నీటి సౌకర్యం కల్పించామని మాజీ ఎంపీపీ జ్ఞానేశ్వర్‌గౌడ్ తెలిపారు. ఆదివారం తన స్వగృహంలో ఆయన మాట్లాడారు. హాస్టల్‌లో నీటి సమస్యపై ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లామన్నారు. ఆయన సూచన మేరకు పైప్‌లైన్ ఏర్పాటు చేసి నీటి సమస్య పరిష్కారం అయ్యిందని తెలిపారు. సోమవారం పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో కొండప్పస్వామి ఆరాధనోత్సవం



పూజలందుకున్న కొండప్పతాత

మద్దికెర: ఎం.అగ్రహారం గ్రామ శివారులోని కొండప్పస్వామి దేవాలయంలో అవధూత కొండప్పస్వామి 46వ ఆరాధనోత్సవం ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక అలంకరణ చేశారు. నైవేద్యం సమర్పించి మహామంగళహారతులు ఇచ్చారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. రాత్రి భజన కార్యక్రమాలు జరిగాయి. నిర్వాహకులు పక్కీరమ్మ, పక్కీరప్ప ఏర్పాట్లను పర్యవేక్షించారు.

విజయేంద్రతీర్థులకు విశేష పూజలు



ప్రత్యేక అలంకరణలో స్వామివార్లు

హొళగుంద: మండల కేంద్రంలోని ఆంజనేయస్వామి ఆలయంలో వెలసిన విజయేంద్రతీర్థుల 410 ఆరాధనోత్సవాల్లో భాగంగా ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం స్వామి వారిని వివిధ రకాల పుష్పాలతో సుందరంగా అలంకరించారు. అనంతరం గోపూజ, లక్ష్మీ పూజ, స్వస్తివాచనం తదితర పూజా కార్యక్రమాలు చేశారు. కాగా సోమవారం నుంచి నాలుగు రోజుల పాటు పూర్వారాధన, ఏకాదశి, మధ్యారాధన, ఉత్తరారాధన కార్యక్రమాలు జరగనున్నాయి. ఉత్తరారాధన రోజు స్వామివారి రథోత్సవంతో ఆరాధనోత్సవాలు ముగుస్తాయని అర్చకులు, ఆలయ ట్రస్ట్ సభ్యులు తెలిపారు.

నెల్లిబండలో చోరీ

దేవనకొండ: నెల్లిబండ గ్రామంలోని ఓ ఇంట్లో చోరీ జరిగింది. దీనిపై బాధితుడు దేవనకొండ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. వివరాలు.. గ్రామానికి చెందిన బోయ లింగన్న కుటుంబంతో కలిసి ఆదివారం మధ్యాహ్నం వ్యవసాయ పనులకు వెళ్లాడు. ఇదే అదునుగా భావించిన దుండగులు ఇంట్లోకి చొరబడి సుమారు రూ.15 వేల నగదు, 10 తులాల వెండి ఆభరణాలు చోరీ చేసినట్లు బాధితుడు ఫిర్యాదులో పేర్కొన్నాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శ్రీనివాసులు తెలిపారు.

పింఛన్ల పంపిణీలో ప్రోటోకాల్ పాటించాల్సిందే



మాట్లాడుతున్న ఎంపీపీ హేమలత

చిప్పగిరి: సామాజిక భద్రత పింఛన్ల పంపిణీలో అధికారులు ప్రోటోకాల్ పాటించాలని ఎంపీపీ జూటూరు హేమలత అన్నారు. ఆయా గ్రామాల్లో పంపిణీ కార్యక్రమానికి ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లకు సమాచారం ఇవ్వాలన్నారు. అధికారులు పార్టీలకు అతీతంగా పనిచేయాలని సూచించారు.

బెల్డోణ సొసైటీ స్పెషల్ ఆఫీసర్‌గా రామరాజు



చిప్పగిరి: బెల్డోణ సహకార సంఘం స్పెషల్ ఆఫీసర్‌గా రామరాజు నియమితులైనట్లు సొసైటీ కార్యదర్శి హరికృష్ణ తెలిపారు. సొసైటీలో నెలకొన్న సమస్యలను స్పెషల్ ఆఫీసర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకుంటామన్నారు.

ఆత్మహత్యకు పాల్పడిన వివాహిత మృతి



మృతి చెందిన సందు గిడ్డమ్మ

కృష్ణగిరి: కడుపు నొప్పి తాళలేక చీమల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన మహిళ చికిత్స పొందుతూ కోలుకోలేక ఆదివారం మృతి చెందింది. ఎస్‌ఐ ఖాజావలి తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన సందు నాగన్న, గిడ్డమ్మ(50) దంపతులకు ఇద్దరు కుమారులు, కుమార్తె సంతానం. నాగన్న ఐస్ బండి నడుపుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. గిడ్డమ్మ కొన్నేళ్లుగా కడుపునొప్పితో బాధపడుతూ పలు ఆస్పత్రుల్లో చూపించుకుంది. ఈ నెల 28న ఇంట్లో ఎవరూ లేని సమయంలో చీమల కోసం తీసుకొచ్చిన మందును నీటిలో కలుపుకుని తాగింది. సాయంత్రం ఐస్ అమ్ముకుని ఇంటికి వచ్చిన నాగన్న భార్య అపస్మారక స్థితిలో ఉండటాన్ని గమనించి వెంటనే డోన్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం సర్వజన ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందినట్లు ఎస్‌ఐ వెల్లడించారు. మృతురాలి కుమారుడు సందు వెంకటరమణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

రక్తదాన శిబిరానికి విశేష స్పందన



రక్తదానం చేస్తున్న యువకులు

మద్దికెర: రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో పెరవలి గ్రామంలో ఆదివారం నిర్వహించిన రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించింది. పలువురు యువకులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. రక్తదానం ప్రాణదానంతో సమానమని.. రక్తదానం చేయడం వల్ల ఎలాంటి సమస్యలు రావని ప్రభుత్వ వైద్యాధికారి రాగిణి అన్నారు.

దేవరగట్టులో ముగిసిన వరుణయాగ పూజలు



పూర్ణాహుతి పూజలు



హోమం చేస్తున్న వేదపండితులు


హొళగుంద: దేవరగట్టు శ్రీమాళ మల్లేశ్వరస్వామి సన్నిధిలో ఈ నెల 28వ తేదీ నుంచి జరుగుతున్న వరుణయాగ పూజలు ఆదివారం పూర్ణాహుతితో ముగిశాయి. ఎల్లెల్సీ సాగునీటి సంఘం మాజీ అధ్యక్షుడు సమ్మతగేరి తప్పెట రామిరెడ్డి, సమ్మతగేరి సర్పంచ్ శోభా దంపతుల ఆధ్వర్యంలో ఈ పూజలు జరిగాయి. టీబీ బోర్డు ఉన్నతాధికారులు, ఎల్లెల్సీ ఎస్డీఓలు, ఆంధ్రా, కర్ణాటక సెక్షన్ ఆఫీసర్లు, రైతు సంఘం నాయకులు, దేవరగట్టు ఆలయ కమిటీ సభ్యులు, నెరణికి, నెరణికి తండా, కొత్తపేట గ్రామపెద్దలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండి అందరూ సుభిక్షంగా ఉండాలని ఈ పూజలు చేసినట్లు నిర్వాహకుడు తప్పెట రామిరెడ్డి తెలిపారు. భక్తులకు అన్నదాన, తీర్థ ప్రసాదాల పంపిణీ చేశారు.

భగవద్గీతపై అవగాహన కల్పించాలి



హరినామ సంకీర్తనలు ఆలపిస్తున్న భక్తులు

కర్నూలు కల్చరల్: భగవద్గీతపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని, ప్రతి ఒక్కరు భగవద్గీత గురించి తెలుసుకోవాలని పఠనం, శ్రవణం చేయాలని నరసరావు పేట ఇస్కాన్ ప్రవచకులు శ్రీనివాస్ అన్నారు. స్థానిక భగీరథ కాంప్లెక్స్‌లోని పూరి జగన్నాథ మందిరంలో ఆదివారం భగవద్గీత శిక్షణ తరగతులు, శీల ప్రభుపాదుల ప్రేమ విందు కార్యక్రమాలు నిర్వహించారు. జగన్నాథ్, బలదేవ్, సుభద్ర మూర్తులను ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన సంస్కృతి, సంప్రదాయాలు, ఆచార వ్యవహారాల గురించి భారత, రామాయణ, ఇతిహాసాల్లో ఉన్నాయని వాటిని విద్యార్థులకు వివరించాలన్నారు. అనంతరం హరే కృష్ణ హరే రామ జప యజ్ఞం నిర్వహించారు. హరి నామ సంకీర్తనలు ఆలపిస్తూ నృత్యాలు చేశారు.



ప్రత్యేక అలంకారంలో జగన్నాథ్, బలదేవ్, సుభద్ర

బండలాగుడు విజేత మాచెర్ల వృషభాలు



రాంపల్లిలో రాతిదూలం లాగుడు పోటీలను ప్రారంభిస్తున్న నిర్వాహకులు

తుగ్గలి: సద్గురు కాశిరెడ్డినాయన ఆలయ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం రాంపల్లిలో రాతి దూలం లాగుడు పోటీలు నిర్వహించారు. పోటీలను బహుమతి దాత అవుకు మండలం సంగపట్నం లక్ష్మీదేవి ప్రారంభించారు. వైఎస్సార్ జిల్లా మాచెర్లకు చెందిన బ్రహ్మానందరెడ్డి వృషభాలు విజేతగా నిలిచాయి. ఆ తర్వాతి స్థానాల్లో ఒంగోలు జిల్లా గుర్లమానుదొడ్డి కుర్వ కర్రెప్ప వృషభాలు, ఓర్వకల్లు మంగలి నడిపన్న వృషభాలు, అనంతపురం జిల్లా బొందలదిన్నె జంగం సోదరుల వృషభాలు, పెండేకల్లు నాగభూషణం వృషభాలు నిలిచాయి. విజేతలకు బహుమతి దాతలు వరుసగా సంగపట్నం లక్ష్మీదేవి రూ.40 వేలు, రాంపల్లి కిష్టప్ప, నల్లగుండ్ల రామయ్య, అగ్రహారం కోదండ రాముడు రూ.30 వేలు, పగిడిరాయి నెట్టికంటి రూ.20వేలు, రాంపల్లి రాజు, లక్ష్మన్న, చనుగొండ్ల సుంకన్న రూ.15 వేలు, రాంపల్లి మొట్టి హనుమంతు రూ.10వేలు అందజేశారు.

గ్రామాల్లో పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి

- పత్తికొండ ఇన్‌చార్జ్ డీఎల్‌పీఓ ప్రకాష్ నాయుడు

ఆలూరు: డివిజన్ పరిధిలోని గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని పత్తికొండ ఇన్‌చార్జ్ డీఎల్‌పీఓ ప్రకాష్ నాయుడు ఆయా పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. ఆలూరు, ఆస్పరి, హొళగుంద, దేవనకొండ, కృష్ణగిరి, వెల్దుర్తి, పత్తికొండ, మద్దికెర, తుగ్గలి, మేజర్ పంచాయతీలుగా ఉన్నాయని తెలిపారు. ఈ పంచాయతీల్లో ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య పనులు చేయించాలని సూచించారు. మురుగునీరు నిల్వలేకుండా చూడాలని, చెత్తకుప్పలను ఎప్పటికప్పుడు తొలగించాలని, వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలని అన్నారు. అలాగే ఆయా గ్రామాల్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద పెరిగిన పిచ్చిమొక్కలు, ముళ్లచెట్లను తొలగించాలని ఆదేశించారు. తాగు నీటి సరఫరాలో లోపాలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

మాళ మల్లేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు



పూజలు చేస్తున్న అర్చకుడు

హొళగుంద: దేవరగట్టు మాళ మల్లేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం స్వామి వారాన్ని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజారులు స్వామి వారి మూల విరాట్‌లకు సుప్రభాతం సేవ, అభిషేకాలు, రుద్రాభిషేకం, బండరార్చన, కుంకుమార్చన, మహామంగళహారతి, నైవేద్య సమర్పణతో పాటు ఇతర ప్రత్యేక పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారిని దర్శించుకోవడానికి వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. పలువురు భక్తులు అన్నదానం చేశారు.

ఎంపీని కలిసిన కురువ సంఘం నాయకులు



ఎంపీ నాగరాజుకు శుభాకాంక్షలు చెబుతున్న కురువ సంఘం నాయకులు

హొళగుంద: కర్నూలు ఎంపీ పంచలింగాల నాగరాజును ఢిల్లీలోని ఆయన గెస్ట్‌హౌస్‌లో ఆదివారం హొళగుంద మండలానికి చెందిన మాదాసి, మాదారి కురువ సంఘం నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఆలూరు నియోజకవర్గంలో వేదావతి ప్రాజెక్ట్, నగరడోణ రిజర్వాయర్, టమాట జ్యూస్ ఫ్యాక్టరీ, జింకల పార్కు ఏర్పాటుకు సహకరించాలని కోరారు. ఎంపీని కలిసిన వారిలో సంఘం నాయకులు పెద్యాట మల్లయ్య, గాదిలింగప్ప, పంపాపతి, చాగప్ప, ఆర్య వైశ్య సంఘం నాయకులు నవీన్, సింగం సుదర్శన్‌రెడ్డి, వెంకటేష్, లోకేష్, కేశప్ప, రాజేష్ తదితరులు ఉన్నారు.

ప్రతి విద్యార్థికి హాస్టల్ సీటు ఇవ్వాలి

ఆదోని సెంట్రల్: ఎస్సీ సంక్షేమ హాస్టల్ ప్రవేశానికి దరఖాస్తు చేసిన ప్రతి విద్యార్థికి హాస్టల్ సీటు కేటాయించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు డిమాండ్ చేశారు. ఆదివారం ఆదోని పట్టణంలోని ఎస్సీ సోషల్ వెల్ఫేర్ జాయింట్ డైరెక్టర్ రంగలక్ష్మిదేవికి వినతి పత్రం అందజేశారు. ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు మాట్లాడుతూ ఆదోని వెనకబడిన ప్రాంతమని, విద్యార్థుల తల్లిదండ్రులు వేరే రాష్ట్రానికి వలస వెళ్తున్న పరిస్థితి నెలకొందన్నారు. ఎస్సీ హాస్టల్‌లో విద్యార్థులకు సీట్లు లేకపోవడం వల్ల విద్యను మధ్యలోనే ఆపాల్సిన పరిస్థితి నెలకొందన్నారు.



హెచ్‌ఎంను సత్కరిస్తున్న ఎమ్మెల్సీ, ఉపాధ్యాయులు

పదవీ విరమణ సన్మానం

పత్తికొండ రూరల్: మండల పరిధిలోని పందికోన ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం కుంపటి నారాయణ పదవీ విరమణ పొందారు. ఈ సందర్భంగా ఆదివారం ఆయన్ను ఎస్టీయూ ఉపాధ్యాయ సంఘం నాయకులు, ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. పత్తికొండలోని రమ్య రిసార్ట్‌లో ఏర్పాటు చేసిన వీడ్కోల సభకు ఎస్టీయూ రాష్ట్ర నాయకుడు సత్యనారాయణ అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా మాజీ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి, ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తిమ్మన్న, జిల్లా అధ్యక్షుడు గోకారి తదితరులు హాజరయ్యారు. కుంపటి నారాయణ, భారతి దంపతులను శాలువా, పూలమాలలతో సత్కరించి వీడ్కోలు పలికారు.



డాక్టర్ ద్వారం ప్రభాకర్‌రెడ్డి, డాక్టర్ చంద్రశేఖరరెడ్డిని సన్మానిస్తున్న దృశ్యం

ఆయుష్ వైద్యులకు సన్మానం

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల ఆవరణలో ఉన్న ఆయుష్ విభాగం వైద్యులు డాక్టర్ ద్వారం ప్రభాకరరెడ్డి (ఆయుర్వేదం), డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి (హోమియో) పదవీ విరమణను పురస్కరించుకుని ఆదివారం ఘనంగా సన్మానించారు. గుత్తిరోడ్డులోని లావాస్టోన్‌లో ఆయుష్ విభాగం వైద్యుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సదరు వైద్యుల ఆయుష్‌కు అందించిన వైద్యసేవలను వక్తలు కొనియాడారు. ఆయుష్ విభాగంలో వారు ప్రత్యేకమైన గుర్తింపు తెచ్చుకున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఏవీఆర్ కాలేజీ అధినేత పలుకూరి వెంకట్రామిరెడ్డి, ఆయుష్ వైద్యులు నాగేశ్వరబాబు, నాగరాజు పాల, పద్మనాభరెడ్డి, రమేష్, నారపురెడ్డి, ఎస్‌వీఎల్ఎన్ ప్రసాద్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మొలక దశలోనే ఎండుతున్న పంటలు

- వర్షాలు లేకపోవడంతో వాడిన పంట
- ఆందోళనలో రైతన్నలు

హాలహర్వి: కొద్ది రోజులుగా మండలంలో వర్షాలు కురవకపోవడంతో పంటలు ఎండుముఖం పట్టాయి. వర్షాధార పంటలు పండించేందుకు సమయం మించిపోతున్నా మంచి వర్షాలు కురవ లేదు. ఇప్పటికే మండలంలోని విరుపాపురం, బలగోట, బిలేహాల్, కుర్లేహళ్లి, నిట్రవట్టి గ్రామాల్లో కొందరు రైతులు పత్తి, సజ్జ, కంది పంటలను సాగు చేశారు. వర్షాలు లేకపోవడంతో పంటలు ఎండిపోతున్నాయి. మరికొందరు వేరుశనగ విత్తనాలు తెచ్చుకొని ఇంట్లోనే పెట్టుకున్నారు. వర్షం వస్తే విత్తుకుందామని ఎదురు చూస్తున్నారు. కానీ వర్షం లేకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. మండలంలో పెద్ద ఎత్తున రైతులు వర్షాధార పంటలపై ఆధారపడి జీవిస్తున్నారు. ఈ కాలంలో పత్తి, సజ్జ, వేరుశనగ, కంది పంటలను సాగు చేసి కలుపులు తీసేవారు. ఈ ఏడాది ముందుగానే వర్షాలు కురవడంతో పొలాలను దుక్కి చేసి విత్తనాలు వేసేందుకు సిద్ధం చేసుకున్నారు. మరికొంత మంది రైతులు కంది, పత్తి విత్తనాలను విత్తినా సరైన సమయంలో వర్షాలు లేకపోవడంతో ఎదుగుదల లేక మొక్క దశలోనే దెబ్బతిన్నాయని.. తాము తీవ్రంగా నష్టపోయామని రైతులు వాపోతున్నారు.



విరుపాపురంలో మొలక దశలోనే ఎండిపోతున్న పత్తి పంట



పదవీ విరమణ పొందిన హెచ్‌ఎం చింతల సుబ్బయ్యను సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

సేవతోనే గుర్తింపు

వెల్దుర్తి(కృష్ణగిరి): విధి నిర్వహణలో అంకితభావం, నిబద్ధతతో ఎంతో మంది ఆప్తులను సంపాదించుకున్న చింతల సుబ్బయ్య కుటుంబసభ్యులు, పూర్వ విద్యార్థుల మధ్య పదవీ విరమణ పొందడం సంతోషంగా ఉందని పగిడ్యాల ఎంఈఓ సుభాన్ అన్నారు. వెల్దుర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఆదివారం హెచ్‌ఎం సుబ్బయ్య పదవీ విరమణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేసి తన 33 ఏళ్ల సర్వీస్‌లో ఎంతో మంది విద్యార్థులను మంచి పౌరులుగా తీర్చిదిద్దారని కొనియాడారు. కార్యక్రమంలో ప్రతిభ స్కూల్ అధినేత అరుణాచలంరెడ్డి, రిటైర్డ్ హెచ్‌ఎం కృష్ణయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.